క్లుప్తంగా

పాండురంగడి కల్యాణోత్సవాలు ప్రారంభం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న సంతాన వేణుగోపాల స్వామి వారికి కూడా తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు ఉభయదాతలు తదితరులు పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు, మురళీకృష్ణ తదితరులు నిర్వహించారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని భవానీపురం ఎస్‌ఐ జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. భవానీపురం శివాలయం రోడ్డులోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం విద్యార్థి మండలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్యఅతిథి జగన్‌మోహన్‌రావు.. ఎన్నికైన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ వారిలో ప్రతిభను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమాజానికి సేవ లందించడానికి విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాధ మాట్లాడుతూ చిన్నారులు సన్మార్గంలో నడిచేలా దిశా నిర్దేశం చేస్తే నాయకులుగా తయారవుతారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల జీఎం శివారెడ్డి, ఏజీఎం కేశవరాజు, డీన్ మీనాక్షి శైలజ, ఇన్‌చార్జి రాఘవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల్లో రుగ్మతలపై అవగాహన



పటమట(విజయవాడతూర్పు): మహిళల్లో హార్మోన్ల ప్రభావంతో అనేక రుగ్మతలు సంభవించే అవకాశం ఉందని దీనిపై యువతులు, మహిళలు అవగాహన పెంచుకోవాలని గైనకాలజిస్ట్ డాక్టర్ వర్ష పాటిల్ అన్నారు. నగరంలోని స్టెల్లా కళాశాలలో మంగళవారం కాలేజీ ఫౌండేషన్ డే సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపడం, లైఫ్ స్టైల్ డిజార్డర్స్ రుతుక్రమ సంబంధిత సమస్యలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ లిటిల్ ఫ్లవర్, స్టూడెంట్ డీన్ డాక్టర్ వీఎస్ మంగాదేవి తదితరులు పాల్గొన్నారు

'సిద్ధార్థ' విద్యార్థికి అభినందన



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): 'సిద్ధార్థ' విద్యార్థి క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటల్ పోటీల్లో ప్రతిభ చాటాడు. ఇస్కాన్ ఆధ్వర్యాన జరిగిన రథ్‌ఫెస్ట్–2024 పోటీల్లో తమ కళాశాల జూనియర్ ఇంటర్ ఎంఈసీ విద్యార్థి వై.శ్రీహర్ష క్లాసికల్ (సోలో) ఇన్‌స్ట్రుమెంటల్ సీనియర్ విభాగంలో వయోలిన్ ప్రదర్శనలో మొదటి బహుమతిని గెలుచుకున్నాడని పీబీ.సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు చెప్పారు. శ్రీహర్షను మంగళవారం కళాశాలలో అభినందించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా శ్రీహర్ష ప్రతిభ చూపాలని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కోరారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటుగా కళాశాల యాజమాన్యం, విద్యార్థులు శ్రీహర్షను అభినందించారు.

ఏఐని పాఠ్యాంశాలుగా చేర్చాలి

గన్నవరం: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఏఐ సంబంధిత సబ్జెక్టులను పాఠ్యాంశాలుగా అందుబాటులోకి తీసుకురావాలని మౌంట్‌ఫోర్ట్ హైదరాబాద్ ప్రొవిన్షియల్ సుపీరియర్ బ్రదర్ షైన్ అలెక్స్ పేర్కొన్నారు. స్థానిక విఎస్.సెయింట్ జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ల్యాబ్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. సీనియర్ బ్రదర్లు జిమ్మి కురియోకోస్, భల్లా జోసఫ్, జయబాలన్ పాల్గొన్నారు.

జగజ్జననికి ఆషాఢ సారె సమర్పణ



ఇంద్రకీలాద్రిపై అమ్మవారికి సారె సమర్పించిన భక్త బృందాలు



ఆలయ ప్రాంగణంలో భక్తజనం



అమ్మవారి ఉత్సవ మూర్తి

తరలివస్తున్న భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా జగజ్జననికి మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తబృందాలు సారె సమర్పించాయి. విజయవాడకు చెందిన శ్రీదుర్గా శివ సాయి సేవా సంఘానికి చెందిన రెండు వందల మంది, రాధా మాధవి భక్త బృందానికి చెందిన వంద మంది, దుర్గాభవాని బృందానికి చెందిన 60 మంది, అరుణ బృందం 60 మంది, వంశీ బృందం 30 మంది, యనమలకుదురుకు చెందిన సోమేశ్వరరావు బృందానికి చెందిన 40 మంది ఇలా అనేక మంది భక్తులు ఇంద్రకీలాద్రికి వచ్చి సారె సమర్పించారు. విశాఖపట్నానికి చెందిన అన్నమాచార్య సేవా సమితి బృందంలోని 50 మందితో పాటు ఇతర ప్రాంతాల నుంచి మరికొన్ని సంఘాలు ఇంద్రకీలాద్రికి విచ్చేశాయి. భక్త బృందాలను ఈవో కె.ఎస్.రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు.

సూపర్‌సిక్స్ పేరుతో 'బాబు' దగా

- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్
- చంద్రబాబు మరోసారి ప్రజలను వంచిస్తున్నాడు
- తల్లికి వందనం హామీ అటకెక్కించారు
- నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1500 అమలు ఏది?
- రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలు
- తప్పుడు కేసులతో భయపెట్టాలని చూస్తున్నారు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సూపర్‌సిక్స్ పేరుతో చంద్రబాబు దగా చేస్తున్నాడని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో ప్రజలకు మాయ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినట్లుగానే 2024లోనే అదే బాటలో పయనిస్తున్నాడని ఆరోపించారు. తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా, ప్రతి ఒక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ఆర్భాటంగా, అట్టహాసంగా టీడీపీ కూటమి ప్రచారం చేసిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక, పథకం అమలులో మరోసారి దగా చేస్తోందన్నారు. తల్లికి వందనం అమలుపై ఇటీవల జీఓ 29 జారీ చేసిన ప్రభుత్వం.. దీనిపై ప్రశ్నిస్తే ఎవరూ స్పందించటం లేదన్నారు. చీటికీ మాటికీ ట్వీట్లతో విరుచుకుపడే నారా లోకేష్‌గానీ, ఎన్నికల ముందు ప్రచారంలో పథకం గురించి గొప్పగా చెప్పిన జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌గానీ ఒక్కమాట మాట కూడా మాట్లాడడం లేదదన్నారు. గడిచిన నాలుగేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం నాలుగు విడతల్లో అమ్మ ఒడికి చేసిన వ్యయం అక్షరాలా రూ.26,067.30 కోట్లు అన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి, 43 లక్షల తల్లుల ఖాతాల్లో.. గత జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభం కాగానే, అదే నెల (2024 జూన్) చివరి వారంలో రూ.15 వేల చొప్పున.. మరో రూ.6400 కోట్లు జమ చేయడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కానీ నేడు టీడీపీ కూటమి మాయ హామీలతో అధికారాన్ని చేపట్టి దానిని నీరుగారుస్తోందన్నారు. మహిళలకు రూ.1500, యువతకు నిరుద్యోగ భృతి వంటి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పటం లేదన్నారు. రాష్ట్రంలో గడిచిన నెల రోజుల్లో శాంతి భద్రతలను ఈ ప్రభుత్వం పూర్తిగా దిగజార్చిందని ఆరోపించారు. మహిళలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై విచక్షణారహితంగా దాడులు చేస్తున్నారని, శ్వేతపత్రాల పేరుతో అబద్ధ ప్రకటనలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. అంతేకాకుండా జగన్‌పై అక్రమ కేసులు బనాయించి అత్యంత పాశవిక చర్యలు తెగబడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సాక్షాత్తూ సుప్రీంకోర్టు తప్పు పట్టినా, అప్పటి ఎంపీ రఘురామ ఫిర్యాదులో వాస్తవం లేదని తేల్చి చెప్పినా, ఆ కేసు అప్పుడే కొట్టివేసిందని గుర్తుచేశారు. మళ్లీ ఈ ప్రభుత్వం నిస్సిగ్గుగా మూడేళ్ల తర్వాత కేసు నమోదు చేయటం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలు గమనిస్తున్నారని, రానున్న కాలంలో టీడీపీ కూటమికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

దుర్గగుడిలో భక్తులకు మౌలిక వసతులపై సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం భక్తులకు కల్పిస్తున్న మౌలిక వసతులపై మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహామండపం నాలుగో అంతస్తులోని ఈవో చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవో కె.ఎస్.రామరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా, పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి విచ్చేశారు. దేవస్థాన మాస్టర్ ప్లాన్‌తో పాటు ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. క్యూ కాంప్లెక్స్, అన్నదానం, ప్రసాదాల పోటు పనులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆలయ ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. అమ్మవారి భక్తులను తీవ్రంగా వేధిస్తున్న పార్కింగ్ సమస్యపై చర్చించారు. ఆలయ అధికారులు పలు సూచనలు చేయగా, ఆయా ప్రభుత్వ శాఖలతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఎల్.రమ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్లను ఎమ్మెల్యే సుజనా చౌదరి దర్శించుకున్నారు.



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఈవో రామరావు

ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలి

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న సైడు డ్రెన్లు, మేజర్ కాల్వల్లో పేరుకుపోయిన సిల్టును ఎప్పటికికప్పుడు తొలగించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. దేవినగర్, వన్‌టౌన్, పాతబస్తీ, పంజాసెంటర్, ఆయుష్ హాస్పిటల్ రోడ్లలో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు పరిశీలించారు. దేవీనగర్లో విజయవాడ వైజాగ్ రైల్వే లైన్ వద్ద ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించడానికి క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ సిబ్బందితో పరిశీలించారు. వన్‌టౌన్ జెండా చెట్టులో వద్ద బీటీ రోడ్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆయుష్ హాస్పిటల్ రోడ్డు, హై టెన్షన్ వైర్ రోడ్డు, రామవరపాడు నేషనల్ హైవే సర్వీస్ రోడ్డులో వర్షం నీటిని చూసి ఇవి నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. నగర ప్రజలకి ఎలాంటి అసౌకర్యం కలగకుండా వ్యర్థాల సేకరణ ఎప్పటికప్పుడు చేయాలని, వాటిని రోడ్డు మీద పడేయకుండా నగరవాసులకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే సీజనల్ వ్యాధుల నుంచిదూరంగా ఉండగలమని ప్రచారం చేయాలని ఆదేశించారు.



డ్రైన్లను పరిశీలిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

రూ.15 వేల నగదు అపహరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఓ వృద్ధురాలికి చెందిన రూ.15వేల నగదును అపహరణకు గురైన ఘటన దుర్గగుడిపై చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కేరళకు చెందిన వరలక్ష్మి.. అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆమె చేతిలో సెల్‌ఫోన్ ఉండటంతో మహా మండపం వద్ద సిబ్బంది అడ్డుకున్నారు. సెల్‌ఫోన్‌ను కౌంటర్‌లో పెట్టాలని చెప్పడంతో వరలక్ష్మి క్యూలోకి వెళ్లారు. చేతిలో ఉన్న సంచితో ప్లాస్టిక్ కవరును పట్టుకుని ఉన్నారు. క్యూ ముందుకు కదిలే క్రమంలో ఆమె చేతిలో కవరు జారిపోయింది. వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆ కవరు తీసుకుని వెళ్లిపోయినట్లు వరలక్ష్మి చెబుతున్నారు. ఆ కవరులో తన భర్త పెరుమాళ్ ఆపరేషన్ కోసం గన్నవరంలో ఉన్న తన తమ్ముడు నారాయణ ఇచ్చిన రూ.15 వేలు ఉన్నాయని ఆమె తెలిపారు. వరలక్ష్మి కన్నీటి పర్యంతం కావడంతో అక్కడి సిబ్బంది మహామండపం ఏడో అంతస్తులోని పోలీస్ అవుట్‌పోస్ట్‌కు తీసుకెళ్లారు. పోలీసు సిబ్బంది సీసీ కెమెరాలో ఫుటేజీ చూసి నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

సామాన్యులకు అందుబాటులో నిత్యావసరాల ధరలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సామాన్యులకు నిత్యావసర సరుకుల ధరలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ (గొల్లపూడి) ఆధ్వర్యాన భవానీపురం రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో దేశవాళీ కందిపప్పు కిలో రూ.160, సోనామసూరి స్టీమ్ రైస్ కిలో రూ.49, పచ్చి బీపీటీ రూ.48కి విక్రయాలను మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యావసర సరుకుల ధరల భారాన్ని తగ్గించేందుకు బహిరంగ మార్కెట్ ధరలకంటే తక్కువగా లభించేలా ఈ ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డీఎస్‌ఓ మోహన్‌బాబు, ఏఎస్‌ఓ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్‌ఐ శివ, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ బాలాజీ, హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి నాగేశ్వరరావు, కాసుల నారాయణ, ప్రసాద్, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ నేతల కబ్జాలో పార్కింగ్ స్థలం

పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కెనాల్ రోడ్డు వద్ద ఉన్న పార్కింగ్ స్థలాన్ని టీడీపీ, బీజేపీ నేతలు దర్జాగా కబ్జా చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో అమ్మవారి ఆలయ కాంట్రాక్టర్ డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. టీడీపీ, బీజేపీ పశ్చిమ నాయకుల సహకారంతో పార్కింగ్ స్థలానికి అమ్మవారి ఆలయ పార్కింగ్ టోకెన్లు జారీ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా అధికారుల మౌనం ఎందుకు వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎస్టేట్ ఆఫీసర్ ఆ స్థలంలో టెండర్ సమయం పూర్తై నెల రోజులు గడుస్తున్నా ఎందుకు మళ్లీ టెండర్ పిలవకుండా అక్రమ వసూళ్లకు ఎవరి ప్రోద్బలంతో ఎందుకోసం సహకరిస్తున్నారని ప్రశ్నించారు. వీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ కాంట్రాక్టు విషయమే కోర్టులో కేసు కూడా నడుస్తోందని అధిక ధరకు టెండర్ కోట్ చేసిన వారికి కూడా ఎందుకు అవకాశం కల్పించడం లేదని అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ తక్షణమే దీనిపై స్పందించాలని కోరారు.

సేవా కార్యక్రమాల్లో ముందంజ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న సీఐటీయూ సామాజిక, సేవా కార్యక్రమాల్లో కూడా ముందు భాగాన నిలుస్తుందన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా ఈ ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. సరళీకరణ విధానాలు అమలు చేస్తున్న ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాన్ని కార్పొరేట్ల చేతుల్లో పడేశాయని తెలిపారు. కార్పొరేట్లు ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చిపిప్పి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు రక్తం సేకరించడం, ప్రోత్సహించడం అనే బాధ్యతను గాలికి వదిలేశాయన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, కార్మికుల సహకారంతో సీఐటీయూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రక్తదానం చేసిన వారిని అభినందించారు. సీఐటీయూ, అనుబంధ సంఘాలకు చెందిన 39 మంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు

సమష్టి కృషితోనే దోమల నియంత్రణ

సీఎంహెచ్‌ఓ డాక్టర్ రత్నావళి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సమష్టి కృషితోనే దోమల నియంత్రణ సాధ్యమని ప్రతి ఒక్కరూ వీఎంసీ సిబ్బందికి సహకరించాలని సీఎంహెచ్‌ఓ డాక్టర్ రత్నావళి పిలుపునిచ్చారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో మంగళవారం డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలతో మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. దోమల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. దోమ తెరలు వాడాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో దోమలు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలన్నారు. దోమలను లార్వా దశలో అంతం చేయాలన్నారు. నీటి నిల్వల్లో గంబూసియా చేపలు, మురుగునీటి నిల్వల్లో ఆయిల్‌బాల్స్ వేస్తున్నట్లు తెలిపారు. అమలేరియా, పారిశుద్ధ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి డెంగ్యూ, మలేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఎంసీ బయాలజిస్టు సూర్య నాయక్, మలేరియా ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ సూపర్‌వైజర్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



దోమల లార్వాను పరిశీలిస్తున్న సీఎంహెచ్‌ఓ డాక్టర్ రత్నావళి, బయాలజిస్టు సూర్యనాయక్

పరిశుభ్రమైన తాగునీటి సరఫరాకు చర్యలు

నున్న(విజయవాడరూరల్): వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా డయేరియా విస్తరిస్తుండటంతో పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి రోజూ తాగునీటి ట్యాంకుల్లో తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో నున్న గ్రామంలో మైక్రోఫిల్టర్ బెడ్స్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో క్లోరినేషన్ లిక్విడ్‌ను కలుపుతున్నారు. మినరల్స్‌కు నష్టం జరగకుండా ఉండే విధంగా మైక్రోఫిల్టర్స్‌తో శుభ్రమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. ప్రతి గంటన్నర సమయానికి ఆరు లీటర్ల క్లోరినేషన్ జరుగుతుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ.రమణ తెలిపారు. ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా తాగునీరు కలుషితమయ్యే ఆస్కారం ఉండదని చెప్పారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

పటమట(విజయవాడతూర్పు): ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు వీఎంసీ నిరంతరం కృషి చేస్తుందని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ అన్నారు. సఫాయి కర్మచారి అసోసియేషన్ అండ్ ట్రీస్ గ్రూప్ మంగళవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో ఆయన్ను కలిసి తాము నిర్వహించే కార్యక్రమాలకు వీఎంసీ సహకారం అందించాలని వినతిపత్రం అందించారు. అసోసియేషన్ తరఫున 2,200 మంది యువతి యువకులతో కలిసి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆర్గానిక్ పద్ధతిలో 15 లక్షల ఫలాల మొక్కలను నాటే విధంగా ప్రయత్నిస్తున్నామన్నారు. అందులో వీఎంసీ భాగస్వామి కావాలని కోరగా అందుకు ఆయన సహకరిస్తామని పేర్కొన్నారు. సఫాయి కర్మ చారి అసోసియేషన్ అండ్ ట్రీస్ గ్రూప్ స్టేట్ ప్రెసిడెంట్ బండి కాశేశ్వరరావు, కోఆర్డినేటర్ మురళి, సెక్రటరీ దుర్గారావు, సభ్యులు పాల్గొన్నారు.




కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సఫాయికర్మచారి అసోసియేషన్ సభ్యులు

నేడు వెంకన్నకు లక్ష తులసీదళార్చన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం లక్ష తులసీదళార్చనను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాసు తెలిపారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని లక్షల తులసీదళార్చనను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉద్యోగావకాశాలు



మైలవరం: యువతలో నైపుణ్యాల పెంపుతో ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. నాగాంజనేయులు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డేను పురస్కరించుకుని కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. నాగాంజనేయులు వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ వేగంగా పెరుగుతున్న జాబ్ మార్కెట్, సరైన నైపుణ్యాలతో యువతకు సాధికారత కల్పించడం, ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ కొరకు వివిధ రకాల కోర్సులను నేర్చుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. పరిశ్రమల నిర్వాహకులు ప్రపంచ సంస్థలతో భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు అభ్యాసాన్ని మెరుగు పరిచే, ప్రతిభావంతమైన కెరియర్ కోసం ఉపయోగపడుతుందన్నారు. డిజిటల్ యుగం నేటి యువతకు అద్భుతమైన అవకాశాలను అందిస్తోందని, యువత ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఎలా ఉండాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ ఆర్.సవిత, ఎన్‌సీసీ విభాగపు ఇన్‌చార్జీలు, ఎన్‌సీసీ విద్యార్థినులు పాల్గొన్నారు.